VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ శనివారం 26 ఏప్రిల్ 2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 273
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# పాక్‌ను ముక్కలు చేయండి

- పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో కలపండి.. సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకొని దాడులు చేయండి
- ఉగ్రమూకలకు గట్టి జవాబు ఇవ్వండి.. మేమంతా మీ వెంటే ఉంటాం
- ప్రధాని మోదీని ఉద్దేశించి సీఎం రేవంత్
- పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ
- మృతులకు నివాళి.. పాక్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- పాల్గొన్న మంత్రులు, మహేశ్‌గౌడ్, అసదుద్దీన్, అజహరుద్దీన్ తదితరులు

హైదరాబాద్: 'మోదీజీ.. పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేయండి. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)ను భారత్‌లో కలపండి. 1967, 1971లో ఇలాంటి దాడులు జరిగినప్పుడు నాటి ప్రధాని ఇందిరా గాంధీ దీటైన జవాబు ఇచ్చారు. పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేసి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేశారు. ప్రధానిగా మీరు ఇప్పుడు తీసుకొనే ఎలాంటి నిర్ణయానికైనా మా సంపూర్ణ మద్దతు ఉంటుంది'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాదులు పర్యాటకులను హతమార్చడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని పీపుల్స్‌ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీకి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రమూకలకు గట్టి జవాబు ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు.

**కఠినంగా వ్యవహరించాలి..**

'పహల్గాంలో భారతీయ పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. రాజకీయాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉంది. ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం చేపట్టే ప్రతి చర్యకూ మద్దతు పలికేందుకు మేం సిద్ధంగా ఉన్నాం'అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 140 కోట్ల మంది భారతీయులంతా ఏకమై తీవ్రవాదాన్ని అంతమొందించి దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రధానిని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.



### రైల్వే ఆస్తులు, కశ్మీరీ పండిట్‌లే లక్ష్యంగా
## ఉగ్రవాదుల ప్లాన్?

కశ్మీర్ లోయలో పనిచేస్తున్న స్థానికేతరులే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడులకు ప్రణాళికలు వేస్తున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

రైల్వే మౌలిక సదుపాయాలు, కశ్మీరీ పండిట్‌లతోపాటు కశ్మీర్ లోయలో పనిచేస్తున్న స్థానికేతరులే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడులకు ప్రణాళికలు వేస్తున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.


2లో

## సింధూ నుంచి చుక్క నీరూ పోనివ్వం

పహల్గాం ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్ మధ్య పూర్తిగా క్షీణించిన దౌత్య సంబంధాలు రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తున్నాయి. సింధూ జలాల నుంచి చుక్క నీరు కూడా పాక్ భూభాగానికి వెళ్లనివ్వరాదని నిర్ణయించిన భారత ప్రభుత్వం...ఆ దేశ ప్రజలకు జారీచేసే 14 రకాల వీసాలను రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది.

- పాక్ జాతీయులను గుర్తించి పంపించేయండి
- గడువు తర్వాత ఒక్కరూ మన దేశంలో ఉండరాదు
- రాష్ట్రాల ముఖ్యమంత్రులతో టెలికాన్ఫరెన్స్‌లో అమిత్ షా
- జమ్మూకశ్మీర్‌లో లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ హతం
- ఉగ్రవాదులను జల్లెడపడుతున్న భద్రతా బలగాలు

## అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రపంచానికి చాటి చెప్పాం


2లో

తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని భారత్ సమ్మిట్ వేదికగా ప్రపంచానికి చాటిచెప్పామంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

- భారత్ సమ్మిట్‌లో తెలంగాణకు పెట్టుబడులను ఆహ్వానించాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


2లో

## దేశాన్ని చీల్చడమే ఉగ్రవాదుల లక్ష్యం

- ఉగ్రవాదం తుదముట్టించేందుకు సంఘటిత పోరాటం
- శ్రీనగర్‌లో మీడియాతో రాహుల్


2లో

## ధాన్యం కొనుగోలులో తీవ్ర నిర్లక్ష్యం

- మద్దతు ధరలు రాక దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీష్ రావు


2లో

## శుభం ద్వివేది కుటుంబానికి యోగి పరామర్శ

కుటుంబ సభ్యుల రోదనలతో కన్నీరు చిందించిన యోగి


2లో

## జేబులు నింపుకునేందుకే కాళేశ్వరం

- వచ్చే కేబినెట్‌లో ఎన్‌డీఎస్ఏపై చర్చించి చర్యలు
- బిఆర్ఎస్ రైతులకు క్షమాపణలు చెప్పాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

# నోవాటెల్‌లో భారత్ సమ్మిట్ ప్రారంభం

**సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి పొంగులేటి**

హైదరాబాద్: హెచ్ఐసీసీలోని నోవాటెల్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో 'భారత్ సమ్మిట్' జరుగుతోంది. పెట్టుబడులు, న్యాయం, అహింస, ప్రపంచ శాంతి లక్ష్యంగా దీన్ని నిర్వహిస్తున్నారు. వివిధ దేశాల నుంచి ప్రతినిధులు తరలివచ్చారు. భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులకు ఘనస్వాగతం లభించింది. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా కళాకారులు, పలువురు కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు. బోనాల డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో సదస్సుకు వారిని ఆహ్వానించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు విదేశీ ప్రతినిధులు మంత్రముగ్ధులయ్యారు.



భారత్ సమ్మిట్ - 2025 లో డెలిగేట్స్ సదస్సులో సమాచార పౌర సంబంధాలు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిపాల్గొన్నారు. ఎంపీ లు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఫీన్ ల్యాండ్, థాయ్ లాండ్, బ్రిటన్ తదితర దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. మాజీ కేంద్ర మంత్రి దిగ్విజయ్ సింగ్ ఈ.సదస్సుకు సమన్వయ అధికారిగా వ్యవహరించారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

## కొల్లేరు సరిహద్దులపై మరోసారి పరిశీలన

న్యూఢిల్లీ:కొల్లేరుపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కొల్లేరు సరిహద్దులపై మరోసారి పరిశీలన జరపాలని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి జస్టిస్ బీఆర్. గవాయి ధర్మాసనం ఆదేశాలు
ఇచ్చింది. కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యంపై తనిఖీ జరపాలని కేంద్ర సాధికార కమిటీకి సూచించింది. కొల్లేరులో ప్రైవేటు భూములను నోటిఫై చేయడంపై ప్రైవేటు మత్స్యకారుల సంఘం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొల్లేరు ప్రస్తుత స్థితిపై నివేదిక అందించాలని సీఈసీకి ఆదేశాలు ఇచ్చింది. ఏపీ వెట్ ల్యాండ్ స్టేట్ అథారిటీ సుప్రీంకోర్టు ఆదేశాలను సరిగా అమలు చేస్తున్నారో లేదోనని నివేదిక ఇవ్వాలని చెప్పింది. కొల్లేరు సరిహద్దులను పరిశీలించాలి, నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు స్టాండింగ్ కమిటీ- తీర్మానాలను, కొల్లేరు సరిహద్దులపై ఆర్ సుకుమార్ కమిటీ- ఇచ్చిన నివేదికను పరిశీలించి సమస్యను పరిగణలోకి తీసుకొని పరిష్కరించాలని సూచించింది. వన్యప్రాణుల సంరక్షణ చట్టంకు అనుగుణంగా కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యం నోటిఫై చేశారా ? కొల్లేరులో ఉన్న ప్రైవేటు భూ యజమానుల హక్కులను ఎలా సెటిల్ చేశారు. 12 వారాల్లోగా సుప్రీంకోర్టులో నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది.

## పాక్ పౌరుల జాబితా పంపండి

న్యూఢిల్లీ: ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాక్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాలను కోరారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల తో ఆయన శుక్రవారం మాట్లాడారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్రానికి పంపించాలని కోరారు. అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాక్ జాతీయులకు భారత్‌లో పర్యటించే అవకాశాలను కల్పించారు. ఈ ప్రోగ్రామ్ కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాలు పోటా పోటీగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అలాంటి వేళ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న పాకిస్థాన్ జాతీయులను వెంటనే వెనక్కి పంపాలని కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకొంది. దాంతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. శుక్రవారం దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయన స్వయంగా ఫోన్ చేసి.. వారికి ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. మీ మీ రాష్ట్రాల్లో నివసిస్తున్న పాకిస్థానీయులను గుర్తించి.. వారిని వెంటనే పాకిస్థాన్ పంపాలని సూచించారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడిలో పాకిస్థాన్ ప్రమేయం ఉందని భారత్ తగిన ఆధారాలను సేకరించింది. అందుకు సంబంధించిన ఆధారాలను ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన విదేశీ కార్యదర్శులకు భారత విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ అందజేశారు. మరోవైపు భారత్‌లో పర్యటిస్తున్న పాకిస్థానీయులు 48 గంటల లోపు దేశం విడిచివెళ్లాలంటూ ఆదేశించింది. దీంతో ఇప్పటికే భారత్‌లో వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న పాకిస్థానీయులు.. స్వదేశం వెళ్లేందుకు అటారీ సరిహద్దు వద్ద క్యూ కట్టారు. అలాగే దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పాకిస్థానీయులను సైతం భారత్‌ను పంపేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. అందులోభాగంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి.. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వివరించారు. జమ్మూ కాశ్మీర్‌లో అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో ఉగ్రదాడి కారణంగా 26 మంది మరణించారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనపై కేంద్రం సీరియస్ అయింది. అందులోభాగంగా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ క్రమంలో భారత్‌లో పర్యటిస్తున్న పాకిస్థానీయులకు జారీ చేసిన వీసా గడువు ఏప్రిల్ 27వ తేదీతో ముగిస్తుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ లోపు వారంతా దేశం వీడి వెళ్లవలసి ఉంటు-ందని పేర్కొంది. దీంతో భారత్‌లో పర్యటిస్తున్న అనేక మంది పాకిస్థాన్ జాతీయులు పంజాబ్‌లోని అటారీ వాఘా సరిహద్దు ద్వారా తమ దేశానికి తిరిగి ప్రయాణమయ్యారు. తమ బంధువులను కలుసుకునేందుకు తాము 45 రోజుల వీసా గడువుపై భారత్‌కు వచ్చామని వారు పేర్కొన్నారు. అంతేకాదు.. ఈ ఉగ్రదాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కేంద్రం ఆదేశాల నేపథ్యంలో అటారీ-వాఘా సరిహద్దును అధికారులు మూసివేసిన విషయం విదితమే. అలాగే న్యూఢిల్లీలోని పాకిస్థాన్ రాయబారి కార్యాలయంలోని దౌత్యవేత్తతోపాటు- మిగిలిన అధికారులు దేశం వీడి వెళ్లాలని ఆదేశించింది. అందుకోసం వారికి వారం రోజుల గడువు విధించింది. ఏప్రిల్ 22వ తేదీ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ విషయంలో భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్‌కు
సింధు జలాలను నిలిపివేసింది. అలాగే అటారీ సరిహద్దును మూసి వేసింది. ఈ ఘటన జరిగిన వెంటనే ప్రధాని మోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశమైంది. దాదాపు 3 గంటల పాటు- జరిగిన ఈ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకొంది.

## ధాన్యం కొనుగోలులో తీవ్ర నిర్లక్ష్యం

సిద్దిపేట: వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట వంటి జిల్లాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు- చేయకపోవడం వల్ల రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని అన్నారు. క్వింటాకి 2,320 రూపాయలు మద్దతు ధర రావాల్సి ఉండగా దళారులకు 2 వేలు, 2,100 రూపాయలకే అమ్ముకుంటున్నారని చెప్పారు. ఇది రైతు కంటక ప్రభుత్వం అని హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పి సగం మందికి చేయలేదని.. రైతు బంధుని వానకాలంలో ఎగ్గొట్టి యాసంగిలో రెండు మూడు ఎకరాలకే ఇచ్చారని తెలిపారు.అకాల వర్షాలు, వడగండ్ల వానల భయంతో రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని దళారులకు అమ్ముకునే దుస్థితి నెలకొందని హరీశ్‌రావు అన్నారు. గతేడాది వానాకాలంలో
మొత్తం 1 లక్షా 53 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పి, కేవలం 52 వేల మెట్రిక్ టన్నులే సేకరించగలిగిందని అన్నారు. మిగతా 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బయటకు వదిలేసిందని.. అంటే మూడొంతుల్లో ఒక వంతు మాత్రమే కొనుగోలు చేయగలిగిందని అన్నారు. రెండొంతుల ధాన్యాన్ని రైతులు తక్కువ ధరకు అమ్ముకున్నారని చెప్పారు. యాసంగి పంటకు కూడా ప్రభుత్వంలో అదే నిర్లక్ష్యం కనబడుతోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు, గాలి దుమారం వల్ల మూడు నాలుగు లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. అందుకు ఎకరాకి 20 వేల రూపాయలను ఇన్‌పుట్ సబ్సిడీగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ల ద్వారా నివేదిక తెప్పించుకొని రైతులను ఆదుకోవాలన్నారు. నంగునూరు మండలం పాలమాకుల వడ్ల కొనుగోలు కేంద్రంలో వడ్లు కొని వారం అయినా ఇంకా రైతులకి డబ్బులు ఇవ్వలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏమో 48 గంటల్లో రైతులకు డబ్బులను అకౌంట్‌లో వేస్తున్నామని హైదరాబాద్‌తో చెబుతారని అన్నారు. గన్నీ బ్యాగులు నాణ్యంగా లేకపోవడం వల్ల హమాలీలకు ఇబ్బందిగా ఉందని.. తూకంలో క్వింటాకి రెండు కిలోలు తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. అటు- అకాల వర్షాలు, ఇటు- రైతు బంధు, మద్దతు ధర రాక ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని వెంటనే ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# దేశాన్ని చీల్చడమే ఉగ్రవాదుల లక్ష్యం



శ్రీనగర్: పహల్‌గామ్ ఉగ్ర దాడి వెనుక వ్యూహం దేశ ప్రజలను చీల్చడం అని, ఉగ్రవాదాన్ని శాశ్వతంగా ఓడించేందుకు భారత్ సంఘటితంగా నిలవడం తప్పనిసరి అని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం ఉద్ఘాటించారు. 'అది దుర్భర విషాదం. ఏమి జరుగుతోందో తెలుసుకుని, సాయం చేయడానికి ఇక్కడికి వచ్చాను. జమ్మూ కాశ్మీర్ ప్రజలు అందరూ ఈ భీకర దాడిని ఖండించారు. వారు దేశానికి పూర్తి మద్దతు ప్రకటించారు' అని రాహుల్ శ్రీనగర్‌లో విలేకరులతో చెప్పారు. శుక్రవారం ఉదయం శ్రీనగర్ చేరుకున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ క్షతగాత్రుల గురించి వాకబు చేయడానికి బాదామిబాఘ్ కంటోన్మెంట్‌లో ఆర్మీ 92 బేస్ ఆసుపత్రిని సందర్శించారు. 'క్షతగాత్రుల్లో ఒకరిని పరామర్శించాను. తక్కినవారు వెనుకకు వెళ్లిపోయినందున వారిని కలుసుకోలేకపోయాను. కుటంబ సభ్యులను కోల్పోయిన ప్రతి ఒక్కరికీ నా సానుభూతి. దేశం సంఘటితంగా నిలుస్తున్నదని ప్రతి ఒక్కరికీ తెలియాలని అనుకుంటు-న్నా' అని రాహుల్ చెప్పారు. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశం గురించి రాహుల్ ప్రస్తావిస్తూ, మొత్తం ప్రతిపక్షాలు ఉగ్ర దాడిని ఖండించాయని, ప్రభుత్వానికి దన్నుగా ఉన్నాయని తెలిపారు. రాహుల్ జెకె లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కూడా కలుసుకున్నారు. పహల్‌గామ్‌లో పరిణామాల గురించి ఆయనకు వారిద్దరు వివరించారు. 'మా పార్టీ వారికి మద్దతు ఇవ్వబోతున్నదని వారిద్దరికీ హామీ ఇచ్చాను' అని రాహుల్ తెలియజేశారు. రాహుల్ అంతకుముందు వర్తకుల ప్రతినిధివర్గాన్ని, విద్యార్థుల నాయకులను, పర్యాటక రంగానికి సంబంధించినవారిని కలుసుకున్నారు.

# కాంగ్రెస్‌ను, మోడీని ప్రశ్నిస్తూనే ఉంటాం

## హామీలపై కాంగ్రెస్‌ను నిలదీస్తాం
## ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



నిజామాబాద్: వరంగల్ రజతోత్సవ సభో కాంగ్రెస్, బిజెపిల హామీలను వారి మోసాలను నిలదీస్తామని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఈ రెండు పార్టీలు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్‌ను,మోడీని ప్రశ్నిస్తూనే ఉంటామని ప్రశాంతరెడ్డి అన్నారు. కెసిఆర్ పాలన, మోడీ పాలనపై ప్రజల్లో చర్చ జరగాలన్నదే తమ లక్ష్యమని వేముల అన్నారు. వ్యవసాయానికి కెసిఆర్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తును అందించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ఎందుకు అందించలేక పోతున్నదని ఆయన అన్నారు. కేంద్రంలోని బిజెపి గ్యాస్ రాయితీ తగ్గించి.. ఎరువులు, యూరియా ధరలు పెంచిందన్నారు. భాజపా సోషల్ మీడియా తప్పుడు ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టాలన్నారు. బిజెపి అధికారంలో ఉన్న ఏ రాష్ట్రమూ బాగుపడ్డ దాఖలాలు లేవన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో భ్రమపెట్టడం అలవాటు చేసుకున్నారని అన్నారు. రైతురాజ్యం రావాలని, దీనికోసం అందరూ కలిసిరావాలని కెసిఆర్ ఇచ్చిన పిలుపుతో ఇప్పుడు మళ్లీ చర్చ మొదలయ్యిందని అన్నారు. కాంగ్రెస్ పాలనతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. తెలంగాణలో రైతులకు ఇప్పుడు కష్టం వచ్చి పడిందని అన్నారు. గతంలో కెసిఆర్ తీసుకున్న నిర్ణయాల కారణంగా నీటి తీరువా లేదు. విద్యుత్తు చార్జీలు లేవు. ధాన్యం కూడా ప్రభుత్వమే కొన్నది. ఆనాడు రైతులు కెసిఆర్‌ను ఎంతగా ఆదరించారో చూస్తే తెలిసిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందని, కాంగ్రెస్‌పై పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టేందుకు యత్నిస్తున్న తీరును నిలదీయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆశలు రేకెత్తించేలా అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని
తెలిపారు. వందరోజుల్లో హామీలు అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్..ఏడాదిన్నర దాటుతున్నా వాటి విషయంలో ఎక్కడ వేసిన అక్కడే గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు.ఎన్నిసార్లు అబద్దాలు చెప్పుకుంటూ రైతులను ఆగం చేస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏ ఒక్క హామీని సరిగ్గా అమలుచేసిన దాఖలాలు లేవన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు కేసీఆర్ సైనికుల్లా పనిచేయాలని వేముల సూచించారు. పసుపుబోర్డు, మద్దతు ధర ఇప్పిస్తానని మోసం చేసిన అర్వింద్‌కు బుద్ధి చెప్పాలన్నారు. అబద్దాలు చెబుతున్న కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పకపోతే ఇంకా ఆగం చేస్తారని అన్నారు. వరంగల్ సభతో ప్రజలకు వాస్తవాలు తెలియచేస్తామని అన్నారు.

# సింధూ నుంచి చుక్క నీరూ పోనివ్వం



దిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్ మధ్య పూర్తిగా క్షీణించిన దౌత్య సంబంధాలు రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తున్నాయి. సింధూ జలాల నుంచి చుక్క నీరు కూడా పాక్ భూభాగానికి వెళ్లనివ్వరాదని నిర్ణయించిన భారత ప్రభుత్వం...ఆ దేశ ప్రజలకు జారీచేసే 14 రకాల వీసాలను రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఆ వీసాలపై వచ్చిన వారందరూ ఆదివారంలోగా దేశం వీడి వెళ్లాలని ఆదేశించింది. మరోవైపు పహల్గాంలో పాశవిక దాడికి పాల్పడిన ముష్కరుల కోసం భద్రతా దళాలు వేటను ముమ్మరం చేశాయి. జమ్మూకశ్మీర్‌లోని బాందీపొరాలో నిషేధిత లష్కరే తయ్యిబా టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని హతమార్చాయి. నియంత్రణ రేఖ వెంట పాక్ సైనికులు గురువారం రాత్రి కాల్పులకు తెగబడగా భారత సైన్యం దీటుగా తిప్పికొట్టింది.

సింధూ పరీవాహక వ్యవస్థలో భాగంగా రియాసీ వద్దనున్న ఆనకట్టసింధూ జలాల కట్టడిపై భారీ వ్యూహం
సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తోన్న పాకిస్థాన్‌కు సింధూ జలాలు ఒక్క చుక్క కూడా పోకుండా కట్టడి చేసేందుకు భారీ వ్యూహాన్ని రూపొందిస్తున్నట్లు కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ వెల్లడించారు. హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం దిల్లీలో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశం అనంతరం పాటిల్ ఈ విషయాన్ని వెల్లడించారు. 'పాకిస్థాన్ పట్ల వ్యవహరించాల్సిన తీరుపై ప్రధాని మోదీ అనేక ఆదేశాలిచ్చారు. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత నిర్ణయాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగానే సమావేశం నిర్వహించాం. హోం మంత్రి అమిత్ షా అనేక సూచనలు చేశారు' అని పాటిల్ తెలిపారు. సీనియర్ మంత్రులతో పాటు పలువురు ఉన్నతాధికారులు ఈ భేటీకి హాజరయ్యారు.

# అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రపంచానికి చాటి చెప్పాం



హైదరాబాద్: తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని భారత్ సమ్మిట్ వేదికగా ప్రపంచానికి చాటిచెప్పామంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం నోవాటెల్ హోటల్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్‌ఖుర్షీద్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, భారత్ సమ్మిట్ కన్వీనర్ పుష్పరాజ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రాంమోహన్‌రెడ్డి తదితరులతో కలసి మీడియాతో భట్టి మాట్లాడుతూ... "ఈ సదస్సు ద్వారా తెలంగాణకు పెట్టుబడులు ఆహ్వానించాం. గతంలో ప్రపంచం మొత్తం రెండు కూటములుగా విడిపోయినప్పుడు నాటి ప్రధాని నెహ్రూ అలీన విధానంతో దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అహింస, సత్యం, సామాజిక న్యాయం అనే మూడు ప్రాథమిక మూల సిద్ధాంతాలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ భారత్ సమ్మిట్ ద్వారా మరోసారి దిశా నిర్దేశం చేస్తోంది. శాంతి, ప్రగతి కాముకులు, ప్రపంచ న్యాయం కోరుకునే వారు చర్చల్లో పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు చరిత్రలో నిలిచిపోతుంది. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయాన్ని మేళవించి కాంగ్రెస్ మూల సిద్ధాంతాలను ముందుకు తీసుకెళుతున్న విధానాన్ని ప్రపంచ ప్రతినిధులకు వివరించగా వారు సంతోషం వ్యక్తంచేశారు. దేశానికే ఆదర్శంగా నిలవబోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని వారిని కోరాం. శాంతి, అహింసా మార్గంలో గ్లోబల్ జస్టిస్ సాధనకు కాంగ్రెస్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చాం" అని వివరించారు. సల్మాన్‌ఖుర్షీద్ మాట్లాడుతూ... "పెట్టుబడులను ఆకర్షించడానికి భారత్ సమ్మిట్ ఏర్పాటు చేయాలనేది తెలంగాణ ప్రభుత్వ వినూత్న ఆలోచన. ఇప్పటికే దేశ, విదేశాల నుంచి తెలంగాణకు పెట్టుబడులు వస్తున్నాయి. మరిన్ని రావాలని ఆకాంక్షిస్తున్నాం" అని అన్నారు.

## ముగిసిన చంద్రమౌళి అంత్యక్రియలు

విశాఖపట్టణం: పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన విశాఖ వాసి చంద్రమౌళి అంతిమయాత్రలో హోంమంత్రి అనిత, మంత్రి సత్యకుమార్, కూటమి నేతలు పాల్గొని నివాళులర్పించారు. ఉగ్రవాదుల చర్యను పార్టీలు, కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. చంద్రమౌళి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటు-ంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 25 మంది భారతీయులు కాగా, ఒకరు నేపాల్‌కి చెందిన వ్యక్తి. ఈ దాడిలో 25 మంది భారతీయులలో ఇద్దరు తెలుగు వ్యక్తులు కూడా ఉన్నారు. నెల్లూరులోని కావలికి చెందిన మధుసూదన్ రావు, విశాఖపట్నానికి చెందిన చంద్రమౌళి ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వ అండగా ఉంటుందని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చారు. విశాఖపట్నానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి ఇంటికి వెళ్లి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. చంద్రమౌళి కుటుంబం ఈ ఘటనను తలచుకుని తీవ్రంగా విలపించింది. మంత్రి వారిని ఓదార్చి, ప్రభుత్వం వారి పక్షాన
నిలుస్తుందని ధైర్యం చెప్పారు. పహల్గామ్ ఘటనపై మాట్లాడుతూ... ఏకతాటిపై నిలబడాల్సిన సమయం ఇది అని, టెర్రరిజానికి మతం లేదన్నారు. కానీ.. పహల్గామ్ ఘటనలో మాత్రం హిందువులను టార్గెట్ చేసి చంపారన్నారు. కల్మా చదవమన్నారని, రాదని చెప్పిన వారిని మోకాళ్లపై కూర్చోబెట్టి బుల్లెట్లు దింపారని బాధితులు చెబుతుంటే బాధాకరంగా అనిపించిదని ఆయన తెలిపారు. అమానుషంగా చంపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు తమ బాధను తను చెప్పుకున్నప్పుడు నోటివెంట మాటలు రాలేదని ఆయన అన్నారు. ఇది అందరి బాధ్యత అని, ఇది పూర్తి ఖండిచాల్సిన విషయమన్నారు. పార్టీలకు అతీతంగా ఈ మారణ హోమాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు.

## జేబులు నింపుకునేందుకే కాళేశ్వరం

హైదరాబాద్:రైతులకు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టుపై అధ్యయం చేస్తామన్నారు. వచ్చే కేబినెట్‌లో ఎన్‌డీఎస్‌ఏపై చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవడి అయ్య జాగీరు అని కట్టారని ప్రశ్నిస్తూ.. కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారు అంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టు రావడంతో బీఆర్ఎస్‌పై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ ఇచ్చిన నివేదికను చూసి బీఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలంటూ మండిపడ్డారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారని.. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక చూసి బీఆర్ఎస్ సిగ్గుపడాలన్నారు. 'మీరే డిజైన్ చేశారు.. మీరే కట్టారు.. మీరుండగానే కూలిపోయింది' అని తెలిపారు. మేడిగడ్డ సుందిళ్ళ నిరుపయోగంగా ఉన్న రికార్డు స్థాయిలో పంటలు పండాయని తెలిపారు. అబద్ధాలు తప్పులపై బతకాలని బీఆర్ఎస్ అనుకుంటోందని.. అది కుదరదని స్పష్టం చేశారు. నిర్మాణం చేసిన వాళు ౣ.. చేయించిన వాళ్ళు రైతులకు ద్రోహం చేశారని ఆరోపించారు. ఎన్‌డీఎస్‌ఏను రేవంత్ రెడ్డినో.. నేనో వేసింది కాదు. దేశంలో బెస్ట్ ఎక్స్‌పర్ట్స్ ఎన్‌డీఎస్‌ఏలో ఉన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడే ఎన్‌డీఎస్‌ఏ వచ్చిందని చెప్పుకొచ్చారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నాము అని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారు..కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

## శుభం ద్వివేది కుటుంబానికి యోగి పరామర్శ



కాన్పూర్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. కుటుంబసభ్యులతో కలిసి సరదాగా విహార యాత్రకు వచ్చిన వారికి విషాదమే మిగిలింది. ఉగ్రదాడిలో చనిపోయిన వారిలో కాన్పూర్‌కు చెందిన శుభం ద్వివేది ఒకరు. భార్యతో కలిసి శుభం వివాహరయాత్రకు పహల్గామ్‌కు వచ్చి ఉగ్రతూటాలకు బలయ్యారు. శుభంకు రెండు నెలల క్రితమే వివాహం జరిగింది. విహహం జరిగి, ఎంతో మంచి భవిష్యత్ ఉన్న శుభం.. ముష్కరుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోవడం ప్రతిఒక్కరినీ కలిచి వేసింది. అలాగే యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా తీవ్ర భావోద్వేనికి గురయ్యారు. కన్నీరు పెట్టు-న్నారు. యోగి ఆదిత్యనాథ్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.ఉగ్రమూకల దాడిలో అమరుడైన శుభం ద్వివేది కుటుంబాన్ని పరామర్శించేందుకు యూపీ సీఎం యోగి వెళ్లారు. సీఎంను చూడగానే శుభం భార్య ఐష్ణయ కన్నీరుమున్నీరుగా విలపించారు. శుభం తండ్రిని ముఖ్యమంత్రి ఓదార్చారు. తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. శుభం తల్లిదండ్రులకు ఆయన ఒక్కడే సంతానమని, రెండు నెలల క్రితమే వివాహం జరిగినట్లు చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే శుభం కుటుంబ సభ్యులకు సీఎం యోగి సానుభూతిని తెలియజేశారు.కాగా.. శుభం ఇంటికి సీఎం యోగా వెళ్లగానే అక్కడ ఒక ఉద్వేగభరితమైన వాతావరణం నెలకొంది. సీఎంను చూడగానే శుభం కుటుంబసభ్యులు కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శుభం భార్య చెప్పిన మాటలతో ముఖ్యమంత్రి యోగి కూడా చలించిపోయారు. 'ఉగ్రమూకల దాడిలో నా భర్త మరణించాడు.. సార్ మేము ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంటున్నాం' అంటూ కన్నీరు పెట్టుకుంటూ ఐష్ణయ చెప్పిన మాటలతో యూపీ సీఎం కూడా తనను తాను నియంత్రించుకోలేకపోయారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని.. తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. యూపీ సీఎం యోగీ.. శుభం ఇంటి నుంచి కన్నీరు పెట్టుకుంటూ వెళ్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోను చూసి నెటిజన్లు కూడా భావోద్వేగానికి గురవుతున్నారు. ఇక.. శుభం ద్వివేది అంత్యక్రియలు గురువారం ప్రభుత్వ అధికారికి లాంఛనాలతో నిర్వహించారు. దేవోరి ఘాట్‌లో వేలాది మంది ప్రజలు శుభంకు కన్నీటితో వీడ్కోలు పలికారు.

# 108 వ ఆవిర్భావ దినోత్సవంకు ఓయు సిద్ధం.

వేగుచుక్క న్యూస్,




ఉస్మానియా విశ్వవిద్యాలయం: 108వ ఆవిర్భావ దినోత్సవానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం సిద్ధమైంది. ఈ నెల 26న జరగనున్న ఆవిర్భావ వేడుకలకు ప్రారంభసూచికగా ఫౌండేషన్ డే వాక్ ను ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి ఇంజినీరింగ్ కళాశాల వరకు రెండు కిలోమీటర్ల మేర జరిగిన ఈ నడకలో ఓయూ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రేపు ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే ఓయూ 108వ ఆవిర్భావ ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓయూ సాధించిన విజయాలను వివరించారు. ఓయూ ఔన్నత్యం, వారసత్వాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. వాక్ ముగిసిన అనంతరం.. ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఎర్పాటు చేసిన సమావేశంలో జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాం ఉగ్ర దాడిలో అశువులు బాసిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ... ఉగ్రదాడిని ఖండించారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి సందర్భంలోనే యావత్ దేశం ఐక్యంగా నిలబడాలని అన్నారు. ఇలాంటి పిరికిపందల చర్యలు దేశాన్ని అస్థిరపరచలేవని అభిప్రాయపడ్డారు.

# రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలి.

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, ఏప్రిల్ 25:



మద్దెల చెరువు నుండి పిట్లం వరకు గల రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో అటవీ, రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మద్దెల చెరువు నుండి పిట్లం వరకు గల రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, అడవి కానీ ప్రాంతంలో చెట్లు నరికివేతకు అటవీ శాఖ అనుమతి జారీ చేయడం జరిగిందని తెలిపారు. అడవి కానీ ప్రాంతంలో ఉన్న చెట్లను శాఖాపరమైన పద్ధతిలో పరిహారం చెల్లించి తొలగించవలసిందిగా రోడ్లు భవనాల శాఖను కలెక్టర్ ఆదేశించారు. అట్టి ఫారెస్ట్ రీచ్ లో స్టేజి 1 పర్మిషన్ కొరకు వెంటనే చర్యలు తీసుకొని పనులు మొదలు పెట్టవలసిందిగా ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వీణ, రోడ్లు భవనాల శాఖ ఈఈ రవి శంకర్, ఎఫ్.డి. ఒ. రామకృష్ణ, ఎఫ్.ఆర్. ఒ. రవి, ఏఈఈ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 25 :



నిజామాబాద్ జిల్లా జడ్జిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన జిల్లా న్యాయమూర్తి జీ.వీ.ఎన్.భరతలక్ష్మిని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా న్యాయస్థానాల సముదాయ భవనంలోని జిల్లా జడ్జి ఛాంబర్లో ఆమెకు పూల మొక్కను అందించి స్వాగతం తెలియజేశారు. ఇరువురు కొద్దిసేపు భేటీ అయ్యి జిల్లా స్థితిగతులపై చర్చించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ అన్నారు.

# అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలి.

## పీడీఎస్ యు డిమాండ్.

## టియు మెయిన్ గేట్ ముందు నిరసన.

వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, ఏప్రిల్ 25:

యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలని పిడిఎస్ యూ చేపట్టిన నిరవదిక సమ్మె శుక్రవారం నాటికి 7 వ రోజుకు చేరింది. సమ్మెకు మద్దతుగా యూనివర్సిటీ మెయిన్ గేట్ ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా 12 యూనివర్సిటీలలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమ సేవలను అందిస్తున్నారని అన్నారు. రెగ్యులర్ రిక్రూట్మెంట్లో మొదట కాంట్రాక్ట్ అధ్యాపకులను తీసుకొని మిగతా పోస్టులు భర్తీ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, యూజీసీ పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ అయ్యే వరకు జరిగే పోరాటానికి పిడిఎస్ యూ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో తేయూ పిడిఎస్ యూ నాయకులు అక్షయ్, రామకృష్ణ, యశ్వంత్, హనుమండ్లు, మనోజ్, భీమేశ్, ఆకాష్, అర్జున్ మరియు కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.




# బేస్ బాల్ ఛాంపియన్

## నిజామాబాద్ పైరేట్స్(సత్యశోధక్ జట్టు).






వేగుచుక్క న్యూస్:ఆర్మూర్

మినీ స్టేడియం క్రీడా మైదానంలో ఈనెల 21నుండి 24 వరకు జరిగిన మేజర్ లీగ్ బేస్ బాల్ అండర్ 11 ఛాంపియన్ షిప్ పోటీలలో నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్ జట్టు) విజేతగా నిలిచి ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకుంది. రీజినల్ స్థాయిలో లిగ్ దశలో నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్ ) జట్టుతో పాటు 12 జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్లో నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్ జట్టు) తొర్లికొండ జట్టుపై ఘన విజయం సాధించి ఛాంపియన్లు గా నిలిచి మేజర్ లీగ్ బేస్ బాల్ కప్ ఇండియా హెడ్ ఇంచార్జ్ జపాన్ కు చెందిన మిస్టర్ రియో చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు.సత్యశోధక్ పాఠశాల జట్టులో పాఠశాలకు చెందిన నరేందర్, శ్రీహిత్ రెడ్డి, శ్రీకాంత్, శరత్ చంద్ర, తిరుపతి, సాత్విక్, జశ్వంత్, మనోజ్, హేమంత్, శ్రీవర్ధన్, రిత్విక్, సాయి సృజన్ లు సభ్యులుగా, పాఠశాల పి.ఈ.టి. ఉపాధ్యాయులు బాదావత్ సంతోష్, దండు అనిల్ లు కోచ్ మేనేజర్లుగా వ్యవహరించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జూన్ మొదటి వారంలో జరగనున్న జాతీయ మేజర్ లీగ్ బేస్ బాల్ ఇండియా కప్ - 2025 పోటీలకు నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్) జట్టు ఎంపికైంది. నిజామాబాద్ రీజినల్ లీగ్ బేస్ బాల్ అండర్11 విభాగంలో సత్యశోధక్ పాఠశాల జట్టు ఛాంపియన్ గా నిలవడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హర్షం వ్యక్తం పరుస్తూ జట్టు విజయానికి కృషి చేసిన పాఠశాల క్రీడాకారులను, కోచ్ మేనేజర్లను మరియు సహకారం అందించిన విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

# కార్మిక వ్యతిరేక "లేబర్ కోడ్స్"ను తిప్పికొట్టండి.

## - టియుసిఐ "మేడే" పిలుపు.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 25:




ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్.ఆర్ భవన్, కోటగల్లీలో 139వ మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ, దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవులలో కేవలం ఏడు కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ, సాంఘిక భద్రత, తగిన వేతనాలు అందుతున్నాయన్నారు. మిగతా 40 కోట్ల శ్రమజీవులకు సరిపడా వేతనాలు, జీవనభద్రత లేదన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 15 చట్టాలను కేంద్ర ప్రభుత్వం అడ్రస్ లేకుండా చేస్తూ, మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా ఆమోదించి, అమలు చేయాలని చూడడం వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారబోతున్నారని ఆరోపించారు. మేడే స్ఫూర్తితో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం కోసం, ఉద్యోగ, సామాజిక భద్రత కోసం పోరాడాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను నిలుపుదల చేయాలని, పనిగంటల పెంపుదలను వ్యతిరేకిస్తూ జిల్లాలో 139వ మేడే జరుపుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న జిల్లా నాయకులు కిషన్, సాయన్న, రవి, సాయిబాబా, భాస్కరస్వామి, గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసంతో సమస్యలను ఎదుర్కోవాలి.






**పోలీస్ కమిషనర్ సాయి చైతన్య. ఆడపిల్లలలో ఆత్మరక్షణ, పెంపొందించేందుకు సమ్మర్ క్యాంపు ప్రారంభం.**

వేగుచుక్క న్యూస్,

నిజామాబాద్, ఏప్రిల్ 25: ఆత్మవిశ్వాసంతో సమస్యలను ఎదుర్కోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. ఆడపిల్లలలో ఆత్మరక్షణ, ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు సమ్మర్ క్యాంపులు దోహదపడుతాయన్నారు. సీపీ సాయి చైతన్య ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి మే 2 వరకు (వారం రోజుల పాటు) నిర్వహించే ఆర్మూర్ రోడ్డులోని ఆర్బీవీఆర్ఆర్ స్కూల్ లో సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం సమ్మర్ క్యాంపును నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ, పాఠశాలలోని చదువులకు సమ్మర్ క్యాంపులకు చాలా తేడా ఉంటుందన్నారు. భవిష్యత్తులో ముందుకు వెళ్లాలి, సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అనే ప్రతి ఒక్క అంశంపై ఈ క్యాంపులో వివరిస్తామన్నారు. విద్యార్థులకు, ముఖ్యంగా ఆడపిల్లలకు, ఆత్మరక్షణ, ఆత్మస్థైర్యం పెంపొందించడం నేరాలపై అవగాహన కల్పిస్తామన్నారు. శిబిరంలో వారు తమను తాము రక్షించుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను, ధైర్యాన్ని ఎలా పొందాలనే దానిపై శిక్షణ పొందుతారన్నారు. విద్యార్థులకు శిబిరంలో, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకునేందుకు సెల్ఫ్ మోటివేషన్ (ప్రేరణ) క్లాసెస్ కూడా ఉంటాయన్నారు.

**మానసిక వైద్యుడు డాక్టర్ విశాల్ మాట్లాడుతూ..**

ప్రస్తుత సమాజంలో సెల్ఫోన్ మోజులో తప్పుదారులు పడుతున్నారన్నారు.

మంచి భవిష్యత్తు కోసం ముందుకు వెళ్లే విధంగా పలు సూచనలు చేశారు. అనంతరం మోటివేషనల్ స్పీకర్, వై బ్రాంట్స్ ఆఫ్ కలాం తిరుణగిరి శ్రీహరి మాట్లాడుతూ.. సమాజంలో విద్యార్థులు ఎలా ఉండాలో మెలకువలను నేర్పించారు

సమాజంలో విద్యార్థులు ఎలా ఉండాలో మెలకువలను నేర్పించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ఎలా ఎంచుకోవాలి ఎలా లక్ష్యసాధనకు ముందుకు వెళ్లాలో పలు అంశాలను క్లుప్తంగా వివరించారు.

ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు తైక్వాండో ట్రైలర్ మనోజ్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సాయికిరణ్, సుమారు వందమంది విద్యార్థినిలు పాల్గొన్నారు.






# పాక్ ఎప్పుడూ పక్కలో బల్లెమే !

భారత్‌లో ఉగ్రదాడులు జరినప్పుడల్లా పాక్ బుకాయింపులతో కాలక్షేపం చేస్తుంది. తనకు సంబంధం లేదని చెబుతుంది. ఉగ్రవాదులకు మాదేశంలో స్థానం లేదని చెప్పడం కూడా అలవాటు చేసుకుంది. ముంబై ఉగ్రదాడుల సమయంలోనూ ఇదే చెప్పింది. అలాగే అజ్మల్ కసబ్ గురించి వివరాలు చెప్పినా కసబ్ మా దేశస్థుడు కాదని బొంకింది. చివరకు కసబ్ పుట్టుపూర్వోత్తరాలు బయటపడ్డాక కూడా అదే పాట పడింది. ఇప్పుడు పహల్గాం ఉగ్రదాడితో తమకు సంబంధం లేదని పేర్కొంది. మరి ఢిల్లీలోని పాక్ రాయబారి కార్యాలయంలో కేక్ సంబరాలపై ఆ దేశం స్పందించాల్సి ఉంది. ముష్కరులకు పాక్ పూర్తి మద్దతు ఇస్తోందన్న వాదనకు కేక్ వ్యవహారం పక్కా రుజువుగా నిలిచింది. ఇవన్నీ మరచిపోయి బలూచిస్థాన్ ఘటనలను భారత్‌కు అంటగట్టే ప్రయత్నం చేసి చేతులు కాల్చుకుంది. మనం టెర్రరిస్టుల జాబితా సమర్పించినా, వారు పాక్‌లో తిష్టవేసుకుని వున్నా వారిని మాత్రం అప్పగించడం లేదు. హాఫీజ్ సయీద్ లాంటి ఉగ్రవాదులను దాచిపెడుతోంది. వారికి పాలుపోసి పెంచుతోంది. ఇదంతా ఒక ఎత్తయితే దాడి తరవాత పాక్ నాయకులు చేస్తున్న ప్రకటనలు ఆ దేశ కుత్సితాన్ని బయటపెడుతున్నాయి. దాడులను ఏనాడు పాక్ ఖండించడం లేదు. ఆధారాలు చూపితే చర్యలు తీసుకోవడం లేదు. సరికదా తాజాగా కూడా పాక్ నేతల ప్రకటనలు ఉగ్రవాదులకు ఊతమించ్చేలా, పాక్ అండదండలతో వ్యవహారం నడిచినట్లుగా కనిపిస్తోంది. నిజానికి మత ప్రాతిపదికన భారత్‌ను చీల్చుకుని ఏర్పడ్డ పాక్ పాలకులు ఏనాడూ నిజాయితీగా లేరు. భారత్‌ను వర్గశత్రువుగా చూపించి పబ్బం గడుపుకోవడం, కాశ్మీర్ బూచి చూపి ప్రజలను వశపర్చుకోవడం తప్ప..ఆ దేశం సర్వ నాశనం అయినా వారికి పట్టింపు లేదు. ఇదంతా నాటి భాతర పాలకులు చేసిన దుర్మార్గపు రాజకీయ క్రీనీడ కారణంగా మనకు సంక్రమించిన రావణకాష్టంగా చెప్పుకోవాలి. దీనికి ఎక్కడో ఓ చోట మందు పెట్టాలి. వ్రణం తీవ్రమయితే కాలు తీసేయాల్సిందే. పాక్ కాల్లూచేతులు విరిచేందుకు వెనకాడరాదు. ఇకపోతే పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడ్డ టెర్రరిస్టుల విషయంలో దాయాది పాక్ దేశ అసలు రంగు ఇప్పుడు బయటపడింది. బయటకు మాత్రం పహల్గాం టెర్రరిస్ట్ దాడితో మాకు సంబంధం లేదని సుద్దాపూస మాటలు మాట్లాడి.. దాడిని ఖండించింది. కానీ పాక్ ఉప ప్రధాని వ్యాఖ్యలతో వారి నిజస్వరూపం బట్టబయలైంది. 28 మంది అమాయక ప్రజలను అత్యంత కిరాతకంగా ఊచకోత కోసిన నరరూప రాక్షసులను పాక్ డిప్యూటీ పీఎం ఇషాక్ దార్ స్వాతంత్ర్య సమరయోధులతో పోల్చాడు. ఆయన వ్యాఖ్యలతో పాక్ వక్రబుద్ధి ప్రపంచదేశాల ముందు మరోసారి తేటతెల్లమైంది. పహల్గాం ఘటనపై ఇషాక్ దార్ ఇస్లామాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ జిల్లాలో దాడులు చేసిన వారు స్వాతంత్ర్య సమరయోధులు అని అభివర్ణించారు. భారత్ సింధూ నది జలాల ఒప్పందాన్ని రద్దు చేయడంపైన కూడా తనకు తోచిన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్‌లో 240 మిలియన్ల మందికి సింధు నది నీరు అవసరం. మీరు ఆ ఒప్పందాన్ని ఆపలేరు. ఒకవేళ ఇండస్ ట్రీటీ-

రద్దు చేస్తే అది యుద్ధ చర్యకు సమానం అని హెచ్చరించారు.ఆ దేశం కూడా అదే విధమైన ప్రతిచర్యను ఎదుర్కొంటుందని అన్నారు. 28 మందిని మానవత్వం లేకుండా మట్టుబెట్టిన ఉగ్రవాదులను పాక్ ప్రధాని ఏకంగా స్వాతంత్ర సమరయోధులతో పోల్చడంపై భారత ప్రజలు భగ్గుమంటున్నారు. ఇదే పాక్ అసలైన బుద్ధి అని విమర్శిస్తు న్నారు. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోంది అనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. పర్యాటకులను మతం ఆధారంగా పరిశీలించి, అడిగి మరీ ఉగ్రమూకలు విచక్షణరహితంగా కాల్పులు జరిపాయి.ముష్కరుల పాశవిక దాడిలో 26మంది అమాయక ప్రజలు మృతి చెందగా.. మరికొందరు పర్యాటకులు బుల్లెట్ గాయాలకు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో పహల్గాంలో దాడికి పాల్పడిన ముష్కరుల కోసం భారత దళాలు జమ్మూ కాశ్మీర్‌ను అణువణువునా శోధిస్తున్నారు.

# 'సింబా' సీక్వెల్‌కు సన్నాహాలు




పోలీసు కథా చిత్రాలను తెరకెక్కించి బాలీవుడ్‌లో విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్నారు దర్శకుడు రోహిత్ శెట్టి. ఇప్పుడాయన రణ్‌వీర్ సింగ్, అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన 'సింబా', 'సూర్యవంశీ' చిత్రాలకు సీక్వెల్‌ను రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న రోహిత్ ఈ సినిమాలకు సంబంధించిన వివరాలను పంచుకున్నారు. "కాప్ యూనివర్స్‌లో భాగంగా రూపొందిన 'సింబా', 'సూర్యవంశీ' చిత్రాలకు సీక్వెల్ కచ్చితంగా వస్తుంది. ఈ చిత్రాలను తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రస్తుతం స్క్రిప్ట్ పనుల్లో ఉన్న 'సింబా' చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తాం" అని ఆయన అన్నారు.



# 'జింఖానా'లో అందరూ హీరోలే

"క్రీడా నేపథ్యంలో సాగే కామెడీ సినిమా 'జింఖానా'. ఒక హీరో చుట్టూ సాగే కథ కాదు. ఇందులో అందరూ హీరోలే" అన్నారు నస్లెన్. 'ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటుడీయన. ఆయన ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన మరో చిత్రం 'జింఖానా'. ఖలీద్ రెహమాన్ దర్శకుడు. ఆయన... జోబిన్ జార్జ్, సమీర్‌కారత్, సుభీశ్ కన్నంచెరితో కలిసి నిర్మించారు. మలయాళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని సుబ్బారెడ్డి ఈ నెల 25న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకి ముందస్తు వేడుకని నిర్వహించారు. దర్శకులు హరీశ్ శంకర్, అనుదీప్, సుజీత్, సాగర్ కె.చంద్ర, సందీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హరీశ్ శంకర్ మాట్లాడుతూ "దర్శకుడు ఖలీద్ బాక్సర్. ఈ సినిమాని అద్భుతంగా తీశారు. ట్రైలర్ చాలా బాగుంది. నాకు సినిమా కంటెంట్ నచ్చితే చాలు... ఆ సినిమా స్థాయిని చూడకుండా ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లడంలో ముందుంటాను. నస్లెన్ నటన చాలా బాగుంది. ఈ సినిమాని అందరూ థియేటర్‌కి వెళ్లి చూడాలని కోరుకుంటున్నా" అన్నారు.



# అతనితో ఆరోసారి

కింగ్ ఖాన్‌తో దీపిక ఆరోసారి జత కట్టనుంది. సిద్ధార్ద్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కనున్న "కింగ్" చిత్రంలో దీపిక ఓ ప్రత్యేక పాత్ర పోషించనుంది. షారూఖ్ కు ఘన విజయాలిచ్చిన "పఠాన్, జవాన్" చిత్రాల్లో నటించిన పదుకొనె... "ఓం శాంతి" మొదలుకుని ఇప్పటికి అయిదు సినిమాల్లో నటించింది. పెళ్లయి, ఓ బిడ్డకు తల్లయినా కూడా "తగ్గేదేలే" అంటూ దీపిక దూసుకుపోతోంది!!



# పా.రంజిత్ దర్శకత్వంలో జాన్వీ?

మరికొద్ది రోజుల్లో 'పరమ్ సుందరి'గా తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది యువకథానాయిక జాన్వీ కపూర్. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా అగ్రతారల సరసన వరుస అవకాశాలతో జోరు మీదున్న ఈ భామ.. తమిళంలోకి అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. పా.రంజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ వెబ్‌సిరీస్ గురించి ఇప్పుడు మరో వార్త నెట్టింట్లో సందడి చేస్తోంది. "గత కొన్ని నెలలుగా పా.రంజిత్‌తో ఈ విషయంపైనే చర్చలు చేస్తోంది జాన్వీ. మహిళా ప్రాధాన్య కథతో రూపొందుతున్న ఈ సిరీస్‌లో అణచివేత, సామాజిక సమస్యలే ప్రధాన కథాంశంగా ఉండనున్నాయి. జులైలో చిత్రీకరణ ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నార"ని జాన్వీ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'పెద్ది', 'సన్నీ సంస్కారి కీ తులసీ కుమారి' తదితర చిత్రాలున్నాయి.



# 'ఓఎమ్‌జీ 2' దర్శకుడితో మరోసారి

'ఓఎమ్‌జీ 2'తో మంచి విజయాన్ని అందుకున్నారు బాలీవుడ్ విలక్షణ నటుడు పంకజ్ త్రిపాఠి, దర్శకుడు అమిత్ రాయ్. ఇప్పుడీ హిట్ కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు నటుడు పంకజ్. ఇంకా పేరు పెట్టని ఈ సినిమా చిత్రీకరణ బీహార్‌లో మొదలైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పంకజ్ మాట్లాడుతూ.. "అక్షయ్‌కుమార్‌తో కలిసి నటించిన 'ఓఎమ్‌జీ 2' నా కెరీర్‌లో చాలా ప్రత్యేకం. దర్శకుడు అమిత్ రాయ్ తెరకెక్కించిన ఈ సినిమా ఎంతో మంది ప్రేక్షకులకు చేరువయ్యింది. సహజమైన కథలను తెరపైకి తీసుకొచ్చే అమిత్‌తో నా రాబోయే సినిమా కోసం మరోసారి

చేతులు కలిపినందుకు సంతోషంగా ఉంది. సామాజిక అంశాలు,

భావోద్వేగాల కలయికలో దీన్ని రూపొందిస్తున్నాం. ప్రస్తుతం బీహార్‌లో జరుగుతున్న చిత్రీకరణలో భాగంగా 35రోజుల పాటు అక్కడే ఈ సినిమాకు కీలకమైన సన్నివేశాలను తెరకెక్కించనున్నాం. త్వరలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడిస్తామ"ని అన్నారు.

# ఇది క్షమించరాని క్రూరమైన చర్య



## పహల్గాం ఉగ్ర దాడిపై సినీతారల సంతాపం

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి వెళ్లిన పర్యాటకులపై ఇటీవల జరిగిన ఉగ్ర దాడి యావత్ దేశాన్ని కుదిపేసింది. ఎంతో మంది ప్రాణాలను బలితీసుకున్న ఈ దుర్ఘటనను ఖండిస్తూ.. ఈ దాడి క్షమించ రానిదంటూ పలువురు సినీతారలు సామాజిక మాధ్యమాల వేదికగా మృతులకు సంతాపం తెలిపారు. కష్టమైన ఈ సమయంలో దేశమంతా మీకు తోడుగా ఉంటుందంటూ బాధిత కుటుంబాలకి ధైర్యం చెప్పారు.

చిరంజీవి: "జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యాటకులను బలిగొన్న దారుణమైన ఈ దాడి భయంకరమైనది. ఇది క్షమించరాని క్రూరమైన చర్య. మరణించిన వారి కుటుంబాలకు నా సానుభూతిని తెలియజేస్తున్నా. వారి నష్టం తీర్చలేనిది"

బాలకృష్ణ: "ఉగ్రదాడి హేయం... అణచడమే మన ధ్యేయం. కశ్మీరం మనదే సదా... పోరాడుదాం పద... అసువులు బాసిన అమాయక పౌరులందరికీ అశ్రు నివాళి"

మహేశ్‌బాబు: "ఇది చీకటి రోజు. పహల్గాంలో జరిగిన దాడి గురించి తెలిసి చాలా బాధపడ్డాను. ఇలాంటి క్రూరత్వానికి వ్యతిరేకంగా కలిసి నిలబడే శక్తి మనకు లభిస్తుందని ఆశిస్తున్నా. క్లిష్టమైన ఈ సమయంలో నా ఆలోచనలు, ప్రార్థనలు బాధితుల కుటుంబాలతో ఉన్నాయి"

రామ్‌చరణ్: "ఉగ్రదాడి నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇటువంటి సంఘటనలకి మన సమాజంలో స్థానం లేదు. వీటిని తీవ్రంగా ఖండించాలి. బాధిత కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నా"

ఎన్టీఆర్: "బాధితులను చూస్తుంటే నా హృదయం బరువెక్కుతోంది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. శాంతి కోసం ప్రార్థిస్తున్నా"

అల్లుఅర్జున్: "పహల్గాం ఎంతో అందమైన ప్రదేశం. అక్కడ జరిగిన ఈ దాడి గురించి తెలిసి నా గుండె పగిలిపోయింది. బాధిత కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా"

నాని: "20 రోజులపాటు 200 మంది సినిమా బృందంతో కలిసి మూడు నెలల కిందట మేం అక్కడే ఉన్నాం. పహల్గాం ఒక కలల ప్రదేశం. అక్కడి ప్రజలు, వాళ్ల ప్రేమా భిమానాలు ఎంతో గొప్పవి. హృదయం ముక్కలైంది, మాటలు రావడం లేదు. ఇదంతా ఎందుకు?"

నాగార్జున: "భయంకరమైన ఉగ్రదాడి నన్ను తీవ్రంగా బాధించింది. తమ ఆప్తుల్ని కోల్పోయిన కుటుంబాలకి సంతాపం. బాధిత కుటుంబాలకి బలం, స్వస్థత, శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. ప్రధానమంత్రి సత్వర స్పందనకి కృతజ్ఞతలు"

"రెండేళ్ల కిందట పహల్గాంలో కశ్మీరీ స్నేహితుల మధ్య, స్వచ్ఛమైన వారి నవ్వుల మధ్య పుట్టినరోజు వేడుకని చేసుకున్నా.

విజయ్ దేవరకొండ: ఆ ప్రదేశంలో నిన్న జరిగిన దాడి గురించి విన్నాక నా హృదయం పగిలిపోయింది. ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం సిగ్గుచేటు. ఇలాంటి పిరికివాళ్లని త్వరలోనే అంతమొందిస్తారని ఆశిస్తున్నా. బాధిత కుటుంబాలకు మేం అండగా నిలుస్తాం"

సోనూసూద్: "అమాయక పర్యాటకులపై జరిగిన ఈ ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. నాగరిక ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు ఉండకూడదు. ఈ దుర్మార్గపు చర్య ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు"

షారుక్ ఖాన్: "నాకు బాధగా.. చాలా కోపంగా ఉంది. ఈ అమానవీయ ఘటనకు వ్యతిరేకంగా న్యాయం కోసం మనమందరం ఐక్యంగా నిలబడాలి"

అక్షయ్ కుమార్: "ఈ దాడి భయంకరమైనది. అమాయకులను చంపడం దారుణం. మృతుల కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నా" –

సంజయ్‌దత్: "ఈ ఉగ్రచర్యపై అందరూ మౌనం వీడండి. వారిపై ప్రతీకారం తీర్చుకోవాలి. ఉగ్రవాదులకు తగిన విధంగా బుద్ధి చెప్పాలి"

సన్నీదేవోల్: "ఈ సమయంలో ప్రపంచం ఉగ్రవాదాన్ని అంతం చేయడం గురించి మాత్రమే ఆలోచించాలి. ఎందుకంటే అమాయక ప్రజలు మాత్రమే ఈ దాడులకు బాధితులుగా మారుతున్నారు"

అలియా: "ఎంతోమంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా. ఈ ఉగ్రవాద దాడిలో ప్రాణాలతో బయటపడిన వారు కుంగిపోకుండా ధైర్యంగా ఉండాలి" –

"ఈ అమానవీయ ఉగ్రవాద చర్యలో తమ వాళ్లను కోల్పోయిన కుటుంబ సభ్యుల బాధను ఊహించలేము. వారి నష్టాన్ని మనం పూరించలేము" అంటూ మోహన్‌లాల్, మమ్ముట్టి, అనిల్‌కపూర్, రష్మిక , మాధురీ దీక్షిత్ తదితరులు సామాజిక మాధ్యమాల వేదికగా మృతులకు సంతాపం తెలిపారు. తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి ఓ ప్రకటనలో మృతులకు సంతాపాన్ని ప్రకటించింది.